# నీ పొటోవు తీసిస్తురా, బిడ్డా!

తిరుమలశ్రీ




**గొడ్లు ఇండ్లకు తిరిగొచ్చే వేళ.. గోధూళి గగనానికి ఎగసే వేళ.. అలసి సొలసిన పక్షులు గూళ్ళకు చేరే వేళ..**

రత్తాలు గుడిసె బయట నాప రాతి దగ్గర కూర్చుని, మొగుడు పొలం దగ్గర బోదెలలో పట్టి తెచ్చిన పిత్తపరిగెలను బాగు చేస్తోంది.

విఘ్నేశు పాత నులకమంచం బయట వేసుకుని తెగిపోయిన తాళ్ళను ముళ్ళు వేస్తూ సరిచేస్తున్నాడు.

శివుడు ఎక్కణ్ణుంచో పరుగెత్తుకొచ్చాడు. సరాసరి తల్లి దగ్గరకు వెళ్ళి, "అమ్మా! నేను పోటోవు దిగుతానే" అన్నాడు.

కొడుకు మాటలకు ఫక్కున నవ్వింది రత్తాలు. చేతిలోని పనాపి మొగుడివైపు తిరిగి, "ఏమ య్యేవ్, ఇనుకున్నావా? నీ కొడుకు పొటోవు దిగుతాడంటా!" అంది మురిపెంగా.

చేస్తూన్న పనాపి నోట్లో కాలు తూన్న చుట్టను తీసి చేత్తో పట్టు కుని తుపుక్కున దూరంగా వుమ్మేశాడు విఘ్నేశు.

"ఏందిరా కత, పోటోవుల మీద మనసయింది నీకియ్యాల?" అన్నాడు కొడుకు వంక చూస్తూ.

శివుడికి పదేళ్ళుంటాయి. పొడవుగా, బక్కపలుచగా వుం టాడు. పాతబడిపోయిన ఖాకీ నిక్కరు తప్ప మరో ఆచ్ఛాదన లేని వాడి ఒం ట్లోంచి మసకబారిన ఎక్స్‌రే ఫోటోలోలా కనిపిస్తాయి ఎముకలు. నాలుగవ తరగతి చదువుతున్నాడు.

శివుడు తండ్రి దగ్గరకు వచ్చి, "అయ్యా, నేను పోటోవు దిగుతానయ్యా!" అన్నాడు గారాం చేస్తూ.

"అదే అడగతున్ననురా, ఇంత అటాత్తుగా నీకు పోటోవు మీదకు మనసు పోయిందేంటా అని?" అన్నాడు విఘ్నేశు, మళ్ళీ తన పనిలో నిమగ్నమవుతూ.

"సరపంచిగోరి రాగవపట్నంలో ఆళ్ళ మేనమామ గోరింటికి పోయి వచ్చిండు. ఆడ పోటోవులు తీయించుకున్నడంట. పిల్లగాళ్ళకు చూపించిండు. మాసక్కంగ వచ్చినయ్" చెప్పుకొచ్చాడు శివుడు. "అయ్యా, అయ్యా! నాకూ పొటోవు తీయించవూ?" తండ్రిని బ్రతిమలాడాడు.

"ఆళ్ళు పెద్దోళ్ళు, ఉన్నోళ్ళు. ఆరితో సరిగా మనమెక్కడ తూగుతంరా బిడ్డా?" అంది రత్తాలు.

"ఏం. మనం మనుసులం కామా? మనకూ పోటోవులు దిగాలనుండదా?" అన్నాడు శివుడు వుక్రోషంగా.

"పులిని చూసి నక్క వాతెట్టుకున్నట్టుంది నీ ఎవ్వారం. పోటోవు తీయించుకోవాలంటే పైస లొద్దా?" అన్నాడు విఘ్నేశు.

"అదంతా నాకు తెల్వాదు. నాకూ పొటోవు కావాల!" శివుడు మారాం చేశాడు.

విఘ్నేశుకి చిర్రెత్తుకొచ్చింది. "నోర్మూసుకుని ఎల్లెహె! ఎర్రేసాలేసావంటే ఈపు చీరేత్తాను" అంటూ పెద్దగా అరిచాడు కొడుకు మీద. ఆ అరుపుకు పక్కనున్న చెట్టు మీది పక్షి పిల్లలు వులిక్కిపడి రెక్కలు టపటపా కొట్టుకున్నాయి.

శివుడు భయపడి తల్లి దగ్గరకు పరుగెత్తాడు.

"పోటోవులు కావాలంట, పొటోవులు!" అని కోపంగా అంటూ, మళ్ళీ తన పనిలో మునిగిపోయాడు విఘ్నేశు.

శివుడు చేపలు చేస్తూన్న తల్లి వీపు మీద పొడుస్తూ, "అమ్మా! మనమూ పట్నం ఎల్దామే. పొటోవు తీయించుకుందామే" అన్నాడు గునుస్తూ, తండ్రికి వినపడకుండా జాగ్రత్త పడుతూ.

"అలాగేలేరా" అంది రత్తాలు, అప్పటికి కొడుకును సముదాయించేందుకని.

"ఎప్పుడెల్దామే?" అనడిగాడు వాడు.

"ఏసవిలో జాతరుందిగదా, ఎల్దాంలే" అంది.

"మరి జాతర్లో నాకు పొటోవు తీయిస్తవా?" అడిగాడు వాడు ఆశగా.

"సూద్దాంలే" అంది.

"సూద్దామంటే కాదు, తప్పకుండా నాకు పొటోవు తీయించాల్సిందే!" అన్నాడు మళ్ళీ తల్లి వీపు మీద పొడుస్తూ.

"అబ్బ ఈపు నొప్పెదుతోంది వుండరా" అని చిన్నగా కసురుకుని, "సూద్దామన్నాగా?" అంది.

తల్లి నుంచి హామీని పొందేందుకని వాడింకా గునుస్తూంటే, "ఏందిరా, ఇంకా నకరాలు సేత్తన్నావ్?" అంటూ కసురుకున్నాడు విఘ్నేశు.

"పో బిడ్డా! పుస్తకాలు తీసుకుని సదువుతూ కూర్చో. తొరగా సేపలకూరొండి కూడెడతాను" అంది రత్తాలు.

శివుడు మారు మాటాడకుండా గుడిసెలోకి వెళ్ళిపోయాడు.

రత్తాలు బుర్రలో తన స్వంత అనుభవం సుళ్ళు తిరిగింది. ఫోటో తీయించుకోవాలన్న కోర్కె తనకూ వుండేది చిన్నప్పట్నుంచీ. ఫోటోల ముఖం ఎరుగని కుటుంబాలు తమవి. కనీసం పెళ్లిలోనైనా తన కోర్కె తీరవచ్చునని ఆశించింది. తన మనసెరిగిన తల్లిదండ్రులు పెళ్ళికి ఫోటోలు ఏర్పాటు చేయాలనుకున్నారు. కానీ, ఆ ఖర్చంతా పెళ్ళికూతురువాళ్ళే పెట్టుకోవాలని పిల్లాడి తరపువారు అనడంతో ఆ ఆలోచనను

## దేశ ప్రగతి

❋ స్వాతంత్ర్యానికి పూర్వం జేబులో డబ్బుతో వెళితే సంచితో సరకులు వచ్చేవి. ఇప్పుడు సంచితో డబ్బుతో వెళితే సరుకులు జేబులు నిండడం కష్టంగా వుంటోంది.

❋ నేటి ఎమ్.ఎల్.ఏలు ప్రతి ఒక్కరూ కనీసం 50 లక్షలు కలిగి వుంటే, ఎం.పి.లు కనీసం కోటి రూపాయలకు తక్కువ గాకుండా ఆస్తులు కలిగి వున్నారు.

❋ యు.పి. మాజీ ముఖ్యమంత్రి మాయావతి రాజకీయాలలోకి రాక పూర్వం గ్రూప్ – డి ఉద్యోగి కుమార్తె. ప్రస్తుతం ఆమెకు 30.94 లక్షల విలువైన ఆభరణాలు, 52 లక్షల రొఖ్ఖం, 9.68 కోట్ల పెట్టుబడులు, 2.5 కోట్ల విలువైన భవంతులు వగైరా వున్నాయట.

❋ ఆర్థికమంత్రి చిదంబరంగారి ఆస్తులు 22 కోట్లు. మణిశంకర అయ్యర్ (మరో కేంద్ర మంత్రి)కి కోటి, మరో మంత్రి బాలుకు 2.2 కోట్లు, టి.ఆర్.ఎస్. నేత కె.చంద్రశేఖరరావుకు 78 లక్షలు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.జనార్ధన రెడ్డికి 1.9 కోట్లు, ఎల్.రాజగోపాల్ ఎం.పి.కి 7.1 కోటి, రేణుకా చౌదరికి 4.9 కోట్లు.. ఇలా కోట్లకు పడగలెత్తినవారే మన ప్రజాప్రతినిధులు, మంత్రులు.

విరమించుకోవడమయింది, ఖర్చులకు తూగలేక. పెళ్ళయిన కొత్తలో కనీసం మొగుడైనా తన ముచ్చట తీరుస్తాడేమోనని ఆశించింది. ఇద్దరూ కలిసి తీయించుకోవాలని ఆశపడింది. అదీ కుదరలేదు ఉమ్మడి కుటుంబం కావడం వల్ల. ఆ తరువాత ఆసక్తి నశించింది. ఆ ఆలోచనా అణగారిపోయింది. ఇప్పుడు మళ్ళీ తన కడుపున పుట్టినవాడు అందుకు ఆశపడుతున్నాడు. వాడి కోర్కె ఎంతవరకు నెరవేరుతుందో తెలియదు. తమ ఆర్థిక పరిస్థితులటువంటివి మరి. చిన్నగా నిట్టూర్చింది రత్తాలు.

పుస్తకం ముందేసుకుని నట్టింట్లో బుడ్డీ దీపం ముందు కూర్చున్నాడన్న మాటేగాని శివుడి మనసంతా ఫోటోల మీదే వుంది. సర్పంచిగారబ్బాయి రాఘవకూ శివుడి వయసే వుంటుంది. ఆ మధ్య పట్నంలో వున్న మేనమామగారింటికి వెళ్ళొచ్చాడు. మేనమామగారింట్లో కెమెరా వుందిట. దాంతో చాలా ఫోటోలు తీశాడు మేనల్లుడివి విడివిడిగానూ, కుటుంబ సభ్యులతో కలిసి జతగానూ. వాటిని తెచ్చి తన జతగాళ్ళకు చూపించి తెగ మురిసిపోయాడు రాఘవ. ఎంతో బాగున్నాయవి. కలర్ ఫోటోలలో రాజకుమారుడిలా కనిపించాడు వాడు, శివుడికి.

అసలు ఫోటో దిగాలన్న కోర్కె శివుడికి ఎప్పట్నుంచో వుంది. వాడితో పాటే పెరిగి పెద్దది కాసాగిందది. చదువుకుంటున్నా, ఆడుకుంటున్నా, ఏ పని చేస్తున్నా వాడి ఆలోచనలన్నీ తాను తీయించుకోబోయే ఫోటో మీదే వుంటున్నాయి. అక్కడ తాను కలర్ ఫోటో తీయించుకున్నట్టు, అందులో తాను సినిమాలలో చూసే రాజకుమారుడిలా ఠీవిగా వున్నట్టూ, అది చూసి తన స్నేహితులంతా అసూయతో కుళ్ళిపోతున్నట్టు. తరచు వాడికి కలలు కూడా రాసాగాయి. వాడి వాలకం కనిపెట్టిన రత్తాలు, "ఎలాగైనా బిడ్డడికి ఓ పోటోవు తీయించగలిగితే బావుణ్ణు" అనుకుంది.

శివుడు రోజులు లెక్కించసాగాడు. ఎప్పుడెప్పుడు జాతర వస్తుందా అని. కౌంట్‌డౌన్ జీరో లెవెల్‌కి చేరుకునేసరికి వాడికి హుషారు అధికమయింది.

విఘ్నేశు, రత్తాలు, శివుడు ఇస్త్రీ దుస్తులు ధరించి పొరుగూళ్ళో జాతరకు బయలుదేరారు. జాతరలో ఫోటో తీయించుకోవచ్చునని శివుడికి సంబరంగా వుంది. ఏడాదికోసారి ఆషాఢ మాసంలో జరిగే అమ్మవారి జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం విపరీతంగా వస్తారు. గరగల వూరేగింపు, రంగుల రాట్నాలూ, వినోద కార్యక్రమాలూ, మ్యూజిక్ షోలూ, ఆటల పోటీలూ, మైకుల్లో పాటలూ, రికార్డింగ్ డాన్సులూ, రకరకాల దుకాణాలూ, తినుబండారాలూతో బహు సందడిగా

వుంటుంది. తల్లిదండ్రులతో కలిసి జాతరంతా తిరిగిన శివుడు బాగా ఎంజాయ్ చేశాడు. విఘ్నేశు కొడుకు కోరిన తినుబండారాలను కొనిపెట్టాడు. ముఖ్యంగా కలర్ సోడాలు తాగాడు. రంగుల రాట్నం ఎక్కారు. ఏం చేస్తూ వున్నా శివుడి మనసు మాత్రం ఫోటో మీదే వుంది. చివరికి ఫోటోలు తీసే టెంట్ దగ్గరకు వెళ్ళారు వాళ్ళు. వేయి వాట్ల బల్బులా వెలిగిపోయింది శివుడి వదనం. బట్టలు సాపు చేసుకుని, జుత్తు చేత్తో సవరించుకుని సిద్ధమయ్యాడు ఫోటో దిగడానికి.

అయితే వాడి ఆశ, ఆనందమూ అడియాసలే అయ్యాయి. పోలరాయిడ్ కెమెరాతో తీసే ఇన్‌స్టెంట్ ఫోటో అది. ధర ఎక్కువ. అంత డబ్బుగాని, అంత డబ్బు పెట్టి అలాంటి ఫోటో తీయించే స్థోమతగానీ విఘ్నేశుకి లేవు. ఫోటో తీయించుకోబోవడం లేదని గ్రహించేసరికి గొప్ప నిరాశ కలిగింది శివుడికి. తీయించుకోవాలన్న కోర్కె కూడా బలమయింది. మంకుపట్టు పట్టాడు తనకు ఫోటో తీయిస్తేకాని అక్కణ్ణుంచి కదలనంటూ.

❋ ❋ ❋

విఘ్నేశుకి బాధగానే వుంది, కొడుకు కోర్కెను తీర్చలేకపోయినందుకు. తన దగ్గర చాలినన్ని పైసలు లేవనీ, తర్వాత పట్నంలో స్టూడియోకి తీసుకెళ్ళి తీయిస్తాననీ నచ్చచెప్పబోయాడు. శివుడు వినిపించుకోలేదు. ఇప్పుడు కాకపోతే మళ్ళీ తనకు ఫోటో తీయించుకునే అవకాశం రాదన్న భయం వాడిది. మారాం చేశాడు. ఫోటోకి బదులు వీపు వాచిపోయింది. నోర్మూసుకుని తండ్రి వెంట నడవక తప్పలేదు. రత్తాలు మనసు చివుక్కుమంది. మిక్కిలి బాధ కలిగింది కొడుకును చేస్తే. ఫోటోకి అంత అవుతుందని ముందే తెలిసి వుంటే మిగతా ఖర్చులు చేసేవాడు కాదేమో! ఆ పైసలతో పిల్లాడి ముచ్చట తీర్చేవారేమో! కొడుకును వోదార్చే ప్రయత్నం తప్ప ఏమీ చేయలేకపోయింది.

శివుడి కోర్కె వాడితోపాటే ఎదగసాగింది. తండ్రి చెప్పిన పట్నం ప్రయాణం అంతవరకూ పొసగలేదు. ఆ పసి మనసులో అసంతృప్తి నానాటికీ పెరిగిపోతోంది. ఆశ అణగారిపోతోంది.

అంతలోనే స్వాతంత్ర్య దినోత్సవం వచ్చింది. ఆ రోజు స్కూల్లో జెండా వందనం వుంటుందనీ, ఆ ప్రాంతపు ఎమ్మెల్యే వచ్చి జెండా ఎగురవేస్తారనీ చెప్పారు మాస్టారు. ఆ సందర్భంగా ఫోటోలు తీస్తారనీ, పిల్లలంతా ఇస్త్రీ చేసిన మంచి దుస్తులు ధరించి రావాలనీ చెప్పారు.

దాంతో శివుడిలో చచ్చిపోతూన్న కోర్కెకు మళ్ళీ ప్రాణం పోసినట్లయింది.

స్వాతంత్ర్య దినోత్సవపు వేడుక స్కూల్లో ఘనంగానే జరిగింది. పత్రికా విలేఖర్లు, ఫోటో గ్రాఫర్లూ, వీడియోగ్రాఫర్లూ వచ్చారు ఎమ్మెల్యే గారి ప్రోగ్రాంని కవర్ చేయడానికి. పతాక వందనం కోసం విద్యార్థులందర్నీ వరుసలలో నిలబెట్టారు. ఆ గ్రామానికి చెందిన మోతు బరుల పిల్లల్నీ, ఆరోగ్యంతో మిసమిసలాడుతూ ఖరీదైన దుస్తులు ధరించిన విద్యార్థులనూ ముందు వరుసలలో నిలబెట్టారు. సమాజం లోని అట్టడుగు తరగతికి చెందిన శివుడు లాంటి బడుగు పిల్లల్ని చివర్లో వుంచారు.

ముందు వరుసలోని మంచి దుస్తులు ధరించిన విద్యార్థుల చేత ఎమ్మెల్యేగారికి పుష్ప గుచ్ఛాలు ఇప్పించి ఫోటోలు తీశారు. వీడియోలో కవర్ చేశారు. చివరి వరుసలలోని పిల్లల గురించి పట్టించుకునేవారు లేకపోయారు. ఎవరైనా గుంపంతటినీ కవర్ చేసినా చివరి వరుసల్లోని వారి ముఖాలు పడతాయని చెప్పడం కష్టం.

ఫంక్షన్ ముగిసి ఎక్కడివారక్కడికి బయలు దేరుతూంటే శివుడి మనసు పీకింది. ముందున్నవారినే కాని వెనుకున్నవారిని ఎవరూ కవర్ చేయలేదన్న అనుమానం వాడికుంది. ఆశించిన ఆ ఒక్క అవకాశమూ చేజారిపోతున్నట్టనిపించింది.

తెగించి, వెళ్ళిపోతూన్న ప్రెస్ ఫోటో గ్రాఫర్ల దగ్గరకు వెళ్ళాడు. "సారూ, సారూ! నా పొటోవు తీయవూ?" అంటూ ప్రాధేయపడ్డాడు. వారి వెంటపడి బ్రతిమాలుకున్నాడు.


వాడి వాలకం చూసి హేళనగా నవ్వుకున్నారంతా. విసుగొచ్చి కసురుకున్నారు. ఫో, పొమ్మంటూ గెంటేసి, వేన్ ఎక్కి వెళ్ళిపోయారు.

జరిగిందంతా కొడుకు ద్వారా ఆలకించి లోలోపలే బాధపడ్డాడు విఘ్నేశు, రత్తాలూను. ఉన్నోడికీ, లేనోడికీ మధ్య అనాదిగా వస్తున్న అగాధం గురించి వాడికి వివరించాలనిపించ లేదు. వివరించినా దాన్ని అర్థం చేసుకునే వయసు వాడికి లేదు. అందుకే అప్పటికి వాణ్ణి లాగో వోదార్చి కుదుటపరిచారు.

ఆ మర్నాడు వార్తా పత్రికల్లో పడిన ఫోటోలలో ఎందులోనూ తన ముఖం కనిపించకపోయేసరికి ఏడుపొచ్చింది శివుడికి. స్కూల్లో నోటీస్ బోర్డులో పెట్టిన ఫోటోలోను తాను లేడు. ఫోటోలలో పడిన పిల్లలు ఉత్సాహంగా ఆ విషయం అందరికీ చెప్పుకుం టుంటే ఉక్రోషం కూడా కలిగింది. చెరువు గట్టుకు వెళ్ళి కూర్చుని చెరువులోని కప్పల్నీ, చేపల్నీ రాళ్ళతో కొడుతూ ఆ విధంగా తన కోపమూ, కసీ తీర్చుకున్నాడు.

❋ ❋ ❋

దేశంలోని రాజకీయాలు ఒక్క యూనివర్సిటీస్‌నే కాదు, ఎలిమెంటరీ స్కూల్సుని కూడా స్పేర్ చేయవన్నట్టు, పట్నంలోని ఏదో ర్యాలీ కోసమని చుట్టుపక్కల పల్లెల్లోని పిల్లలందర్నీ సమీకరించనారంభించింది ఓ పొలిటికల్



## ఓ శ్రీనివాసా!

అసలు ఐశ్వర్య కారకురాలైన
లక్ష్మీదేవియే
నీ ధర్మపత్ని!
కుబేరుని దగ్గర నీవు అప్పు
చెయ్యడమేమిటి!
అసలు భూదేవియే నీ ధర్మపత్ని!
కొండంత నీవు, వరాహస్వామి వద్ద,
కొండపై భూమి తీసుకోవడమేమిటి!
"దేహమే అద్దెకొంప" అన్నీ నీ
సొంతం
అనుకోవడం ఒక మిథ్య!
"నాది" "నాది" అని తలచే తత్వం"
మానవుని మానవులకు
బోధించడానికే
అయి వుంటుంది!
నా తలంపు సరియైనదే కదా శ్రీపతీ!
వేదించక వివరించవయ్యా భూపతీ!

**- భమిడిపాటి సోమయాజి**



# దెబ్బకు దెబ్బ!

తమ సొంత సినిమాలో సెలీనాజైట్లీ నటిస్తున్నప్పుడు పోజు కొట్టిన ఫర్దీన్‌ఖాన్‌కి సెలీనా బాగానే జవాబిచ్చింది. 'జాన్‌షీ' సినిమాలో ఫర్దీన్, సెలీనా హీరో హీరోయిన్లు. అయితే ఆమె టేకులెక్కువ తీసుకున్నా, డ్యాన్స్ సరిగ్గా చేయకపోయినా కొట్టబోయేవాడట ఫర్దీన్. అది మనసులో పెట్టుకుందేమో! ఇటీవల జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైనప్పుడు అందరినీ విష్ చేసిన సెలీనా ఫర్దీన్ వైపు కనీసం చూడనైనా చూడలేదట. ఆ కార్యక్రమానికి సెలీనా ముఖ్య అతిథి కావడం, అందరూ ఆమె చుట్టూ తిరుగుతూ ఉంటే తనను మాత్రం ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ఫర్దీన్ మొహం మాడి పోయిందట.

పార్టీ. అభం శుభం ఎరుగని పసివాళ్ళను కూడా తమ రాజకీయ తంత్రాలతో యంత్రాలుగా ఉపయోగించుకునే భాగంగా చిన్న, పెద్ద, ఆడ, మగ పిల్లల్ని సమాయత్తం చేయసాగారు చోటా నాయకులు. ఉదయం వెళితే సాయంత్రానికి తిరిగి రావచ్చునీ, వ్యాన్లలో తీసుకువెళ్ళి తీసుకు వస్తామనీ, పైసలు కూడా ముదతాయనీ ఏవేవో ఆశలు చూపించి పిల్లలందర్నీ ప్రోగుచేయనారంభించారు.

వాళ్ళు ఆ గ్రామానికి వచ్చేసరికి శివుడి తల్లీ, తండ్రీ ఇంటి దగ్గర లేరు. పొలం పనులు ముమ్మరంగా వుండే సీజన్ కావడంతో కోడి కూయకుండానే పనుల్లోకి వెళ్ళిపోయారు. చీకట్లోగాని తిరిగి రారు.

తోటి పిల్లలంతా ఉత్సాహంగా వ్యాన్లు ఎక్కుతుంటే చూస్తూ ఉండిపోయాడు శివుడు. తనకూ వెళ్ళాలని వుంది గానీ అడగడానికి అమ్మ, అయ్య ఇంట లేరు. పట్నంలోని పిల్లల వూరేగింపు మాట ఎలా వున్నా, పట్నం ప్రయాణం పైసలొస్తాయి అన్న పదాలు వూరింపుగా వున్నాయి వాడికి. ఆ పైసలతో పట్నంలో ఫోటో తీయించుకోవచ్చునన్న ఆలోచన ఉదయించింది. కానీ, తల్లిదండ్రులతో చెప్పకుండా వెళ్ళడానికి మనసు రావడం లేదు.

వాడలా సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలోనే అన్నారెవరో ఆ ర్యాలీలో పాల్గొన్న పిల్లలకు ఫోటోలు తీసి పత్రికల్లో వేస్తారని. అంతే మరి సంకోచించలేదు వాడు. బయలుదేరబోతున్న ట్రాక్టర్ ఎక్కేశాడు వెంటనే.

❋ ❋ ❋

ప్రొద్దు మింటి నడుమకు చేరుకుంటుంటే పొలంలో పనులాపి భోజనాలకు ఉపక్రమించారు కూలీలంతా. విఘ్నేశు బోదెలోని నీళ్ళలో చేతులు కడుక్కుని వచ్చేసరికి అల్యూమినియం క్యారియర్‌లోని అన్నం తీసి చెరో ఆకులోనూ వడ్డించింది రత్తాలు. తినడానికి కూర్చున్నారిద్దరూ, కడుపుల్లో ఆకలి కరకరమంటూంటే. ముద్ద నోట్లో పెట్టుకుంటూంటే అందింది ఆ దారుణవార్త అశనిపాతంలా.

పిల్లలతో ర్యాలీ కోసం పట్నం వెళుతున్న ట్రాక్టర్, లారీకి గుద్దుకుని తిరగబడింది. పది మంది పిల్లలు అక్కడికక్కడే మరణించారు. మిగతావారికి గాయాలయ్యాయి. చనిపోయిన వారిలో శివుడూ వున్నాడు.

కొడుకు పట్నం వెళుతున్న సంగతి ఎరుగని విఘ్నేశుకి, రత్తాలుకీ విషయం ఆకళింపు చేసుకునేసరికి కొంత సమయం పట్టింది. ఆకళింపయ్యేసరికి కాళ్ళూ, చేతులూ ఆడడం మానేశాయి. నోటి దగ్గర ముద్దల్ని నేలకొదిలేసి గుండెలు బాదుకుంటూ పరుగెత్తారు. వారి వెనుకే మిగతావారూను.

ప్రమాద స్థలం చూడ భయానకంగా వుంది. ట్రాక్టరు రోడ్డు మధ్య బోర్లాపడి వుంది. ఆ ప్రాంతమంతా రక్తం పూసుకుంది. చిన్నా చితకా పిల్లలు పదిమంది విగతజీవులై పడి వున్నారు. అందరినీ రోడ్డు పక్కకు వరుసగా పరుండబెట్టారు. వారిలో ముగ్గురు బాలికలు. గాయపడ్డ పిల్లలు రక్తాలు కారుతూంటే బాధతో, భయంతో ఏడుస్తున్నారు.

అక్కడే ఇటుకలతో వస్తున్న లారీ కూడా వుంది. ట్రాక్టర్ డ్రైవరూ, పిల్లల్ని తీసుకు వెళుతున్న మనుషులూ, లారీ డ్రైవరూ పారిపోయారట. చుట్టుపక్కల గ్రామాల ప్రజలంతా పరుగు పరుగున వచ్చారు ఆ ఘోరాన్ని చూడడానికి. అక్కడి దృశ్యాన్ని చూసి కంట తడిపెట్టనివారు లేరు.

పిల్లల్ని పోగొట్టుకున్న తల్లిదండ్రులు గుండెలు బాదుకుని ఏడుస్తున్నారు. తలకు బలమైన దెబ్బ తగిలిన కారణంగా మరణించాడు శివుడు. చలనం లేకుండా పదున్న కొడుకు శవం మీద పడి గొల్లుమన్నారు విఘ్నేశు, రత్తాలూను. ఏడుస్తూ స్పృహ తప్పి పడిపోయింది రత్తాలు. ఎవరో నీళ్ళు తెచ్చి ముఖం మీద చల్లి ఉపచారం చేయడంతో కొంతసేపటికి తెలివి వచ్చిందామెకు.

విగతజీవుడై పడున్న శివుణ్ణి చూస్తుంటే, "అమ్మా, నాకూ పోటోవు తీయించవే అనడుగుతున్నట్టునిపించింది రత్తాలుకు. మొగుడూ, తానూ రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా ఒక్కగానొక్కడి కోరిక తీర్చలేకపోయిన తమ అశక్యతను, అసమర్థతనూ తలచుకుని తలచుకుని విలపించింది రత్తాలు. కొడుకు కోర్కె గుర్తుకొచ్చి లోలోపలే కుమిలిపోయాడు విఘ్నేశు. శివుడు ఇక లేడన్న చేదు నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నారిద్దరూ. కొడుకు శవం మీద పడి ఎడతెరిపి లేకుండా ఏడ్చారు.

పోలీసులు వచ్చారు. పోలీస్ ఫొటోగ్రాఫర్లే కాక, ప్రెస్ ఫోటోగ్రాఫర్లూ, వీడియోగ్రాఫర్లూ కూడా వారితో వచ్చారు. పోలీసులు జనాన్ని దూరంగా నెట్టేశారు. పిల్లల శవాల మీద పడి విలపిస్తున్నవారిని బలవంతంగా లేవదీశారు.

ఫోటోగ్రాఫర్లు పిల్లల శవాలను విడివిగానూ, ఉమ్మడిగానూ ఫోటోలు తీశారు. అన్ని కోణాలలోంచి తీశారు. తల్లిదండ్రుల నుంచి ఆ పిల్లల పేర్లు, వివరాలూ సేకరించారు. వాటి నన్నిటినీ ఫోటోలతోసహా వార్తాపత్రికల్లోకి ఎక్కించేందుకని. ఇక వీడియో ఫిల్మింగు సరేసరి టీవీ ఛానెళ్ళకోసం.

బ్రతికుండగా ఒక్క ఫోటో తీయమని పసివాడు ప్రాధేయపడితే కసిరి విసిరి పారేసిన ఆ బాబులే ఇప్పుడు పోటీలు పడి బోలెడు ఫోటోలు తీస్తున్నారు శివుడికి. బ్రతికుండగా తీరని వాడి కోర్కె చచ్చాక తీరినందుకు సంతోషించాలో, ఏడవాలో తెలీలేదు విఘ్నేశు, రత్తాలులకు.

కొడుకు ఫోటో తీయించమని ఇంకా మారాం చేస్తున్నట్లే అనిపించింది రత్తాలుకి. దుఃఖం వెల్లువయి ముందుకు రావడంతో శివుడి శవం మీద పడి విలపించింది. "పొటోవు పొటోవంటూ అల్లాడిపోతివి. పొటోవు తీసిండ్రురా బిడ్డా! దాన్ని చూ[illegible]కుందుకు నువ్వు లేకపోతివి కదురా నాయనా" అంటూ.